ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
బుధవారం 26 నవంబరు 2025 | 5





డిప్యూటీ సీఎం పర్యటనకు బందోబస్తు ఏర్పాట్లపై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా



కోనసీమకు పవన్‌కల్యాణ్

» నేడు డిప్యూటీ సీఎం పర్యటనకు ఏర్పాట్లు పూర్తి
» కేశనపల్లిలో డ్రెయిన్ వల్ల దెబ్బతిన్న కొబ్బరి తోటల పరిశీలన
» శివకోడులో 2.0 పల్లె పండుగ ప్రారంభం, బహిరంగ సభ

- వివరాలు లోపలి పేజీల్లో..

డీసీఎం పర్యటనపై కలెక్టర్ సమీక్ష

అమలాపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ రాజోలు నియోజకవర్గ పర్యటన విజయవంతానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం డిప్యూటీ సీఎం పవన్ పర్యటన ఏర్పాట్లపై మరోసారి సమీక్షించారు. అధికారులు తమకు కేటాయించిన విధులు, బాధ్యతలు సక్రమంగా నిర్వహిస్తూ ఎటువంటి లోపాలకు ఆస్కారం లేకుండా పర్యటనను పూర్తి చేయాలన్నారు. పవన్ డిప్యూటీ సీఎం అయ్యాక తొలిసారి జిల్లాకు వస్తున్నందున జనసైనికులు, అభిమానులు సంయమనం పాటిస్తూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. 2.0 రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. శివకోడులో పల్లెపండుగ 2.0 పైలాన్ ఆవిష్కరణ, ఎగ్జిబిషన్ తిలకించడం, జ్యోతి ప్రజ్వలన అనంతరం బహిరంగ సభలో పాల్గొనే కార్యక్రమాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. జేసీ టి.నిశాంతి, ఎస్పీ రాహుల్ మీనా, డీఆర్వో కె.మాధవి, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం రాష్ట్ర సంచాలకుడు షణ్ముక్‌కుమార్, ఆర్డీవోలతో సహా వివిధ శాఖ అధికారులు సమీక్షలో పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగించవద్దు : ఎస్పీ

పవన్‌కల్యాణ పర్యటన నేపథ్యంలో కేశనపల్లి, శివకోడులో జరిగే బందోబస్తు ఏర్పాట్లను జిల్లా ఎస్పీ రాహుల్ మీనా దగ్గరుండి పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో పవన్ పర్యటించే ప్రాంతాలను సందర్శించి భద్రతాపరమైన లోపాలు తలెత్తకుండా ప్రత్యేక జాగ్రత్తలపై అధికారులకు సూచనలిచ్చారు. క్వానాయ్ పర్యటనలో భాగంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగకుండా ట్రయల్‌రన్ నిర్వహించారు. బందోబస్తు విధులకు హాజరైన ఉన్నతాధికారులు, సిబ్బందితో ఎస్పీ మీనా ప్రత్యేకంగా మాట్లాడి విధుల్లో అలసత్వం వహించకుండా ప్రజలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేయాలని, భద్రత విషయంలో రాజీ పడకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎస్పీ వెంట అడిషనల్ ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్‌తోపాటు జిల్లాలోని అధికారులు పాల్గొన్నారు.



తూరుపు.. సిందూరం!

ఉమ్మడి తూర్పుగోదావరి సిగలో మరో కొత్త జిల్లా

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలు మూడు కాదు.. నాలుగు కానున్నాయి.. రంపచోడవరం కేంద్రంగా మరో కొత్త జిల్లా పోలవరం ఏర్పాటు కానుంది. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను 2022లో అప్పటి వైసీపీ ప్రభుత్వం కాకినాడ, రాజమహేంద్రవరం, కోనసీమ పార్లమెంట్ నియోజకవర్గాలను మూడు జిల్లాలుగా ప్రకటించింది. నాడు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా విభజన జరగలేదు. అప్పట్లో ప్రజలు ఉద్యమాలు చేసినా పట్టించుకోలేదు. ప్రభుత్వం మారిన తరువాత సీఎం చంద్రబాబు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని నిర్ణయించారు. ఏజెన్సీలో రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తున్నారు.. కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోటను పెద్దాపురం డివిజన్‌లో కలిపారు. మండపేట నియోజకవర్గాన్ని తూర్పులో విలీనం చేయనున్నారు.

» పోలవరం జిల్లా ఏర్పాటు
» రంపచోడవరం కేంద్రం
» రెండు డివిజన్లతో నిర్ణయం
» నాలుగుకు పెరిగిన జిల్లాలు
» 'తూర్పు'న కలిసిన మండపేట
» పెద్దాపురానికి..సామర్లకోట
» ప్రజల ఆకాంక్షలకు పెద్దపీట
» గిరిజనానికి తీరిన ఇబ్బంది
» ఇక ఆమోదమే తరువాయి..

మండపేట కేరాఫ్ తూర్పుగోదావరి

కోనసీమ జిల్లాలో ఉన్న మండపేట నియోజకవర్గాన్ని పూర్తిగా తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయనున్నారు. మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం మండలాలు రాజమహేంద్రవరానికి సమీపంలో ఉన్నాయి. మండపేట రాజమహేంద్రవరానికి 26.3 కి.మీ దూరంలో ఉండగా ప్రస్తుత జిల్లా కేంద్రం అమలాపురం 47.5 కి.మీ దూరంలో ఉంది.మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సైతం మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని అసెంబ్లీలో కోరారు.ఇదే ప్రతిపాదన మంత్రి వర్గ ఉపసంఘం చేయడంతో ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజా మార్పులతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్‌లోని మండపేట నియోజకవర్గం తొలగిపోనుండడంతో రామచంద్రపురం రెవెన్యూ డివిజన్ అతి చిన్నదిగా మారిపోతోంది. ఈ డివిజన్‌ను అలాగే ఉంచుతారా లేదా సమీపంలోని కొత్తపేట డివిజన్‌లో కలుపుతారా అనేది చూడాలి. దీంతో కోనసీమ జిల్లాలోని నియోజకవర్గాల సంఖ్య ఆరుకు పడిపోగా.. తూర్పుగోదావరి జిల్లాలో నియోజకవర్గాల సంఖ్య 8కి చేరింది. ఇప్పటికే ముమ్మిడివరం నియోజకవర్గం తాళ్లరేవు మండలం కాకినాడ జిల్లాలోను రామచంద్రపురం నియోజకవర్గంలోని కాజులూరు మండలం కాకినాడ జిల్లాలో ఉండడంతో కోనసీమ చిన్న జిల్లాగా మారింది.దీనిపై రాజకీయంగా ఉద్యమాలు ప్రారంభమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

గిరిజనానికో జిల్లా

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. గత ప్రభుత్వ నిర్వాకంతో అల్లూరి సీతారామరాజు జిల్లాలోకి రంపచోడవరం నియోజకవర్గం వెళ్లిపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడ్డారు. రంపచోడవరం, చింతూరు డివిజన్‌ల పరిధిలోని రంపచోడవరం, దేవీపట్నం, మారేడుమిల్లి, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజ ఒమ్మంగి, చింతూరు, వి.ఆర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజానీకం జిల్లా కేంద్రానికి 300 కి.మీ దూరంలో ఉన్న పాడేరు వెళ్లాల్సి వచ్చేది. మంత్రివర్గ ఉపసంఘం నివేదిక మేరకు సీఎం చంద్రబాబు రంపచోడవరం కేంద్రం పోలవరం జిల్లా ఏర్పాటుకు నిర్ణయించడంతో ప్రజల వెతలు తీరనున్నాయి. 2022లో చంద్రబాబు చింతూరు డివిజన్‌లోని కూనవరం మండలం కోతులగుట్టలో పర్యటించారు. మేము అధికారంలోకి రాగానే పోలవరం జిల్లా ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ నెరవేర్చారు. ఈ మేరకు 11 మండలాలతో సుమారుగా 3.49 లక్షల జనాభాతో భౌగోళికంగా ఈ కొత్త జిల్లా ఆవిర్భవించనున్నది. వై రామవరం మండలంలోని గుర్తేడు కేంద్రంగా మండలం ఏర్పాటుకు కసరత్తు జరుగుతోంది. తుది నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. ప్రస్తుతం 11 మండలాలతో జిల్లా ఏర్పాటుచేసినా దేవీపట్నం, కూనవరం, వీ.ఆర్.పురం, చింతూరు, ఎటపాక మండలాల్లో 150 గ్రామాలు పోలవరం ముంపులోనికి వెళ్లిపోతాయి. పూర్తిగా కూనవరం, వీ.ఆర్.పురం, దేవీపట్నం మండలాలు కనుమరుగైపోతాయి. చింతూరు, ఎటపాక మండలాల్లో పలు గ్రామాలు ముంపులోనికి వెళ్లిపోతాయి. దీంతో కొత్త జిల్లాలో 8 నుంచి 9 మండలాలే మిగులుతాయి. ఈ పరిస్థితుల్లో పోలవరం నియోజకవర్గాన్ని ఈ జిల్లాలో కలిపితే ఎలా ఉంటుందని యోచిస్తున్నారు. అక్కడా పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాలు ముంపులోకి వెళ్లిపోతాయి. గిరిజన జిల్లాలకు రెవెన్యూ ఎలా ఉంటుందనే చర్చ సాగుతోంది. ప్రస్తుతం అల్లూరి జిల్లా, పార్వతీపురం మన్యం జిల్లాలకు రెవెన్యూ లేదు. అయినా రంపచోడవరం, చింతూరు డివిజన్ల ప్రజల సమస్యలను ఎలా తీర్చాలన్న అంశంపై ప్రభుత్వం యోచిస్తోంది. పోలవరం జిల్లా ఏర్పాటుతో రాష్ట్రంలో ఇది మూడో గిరిజన జిల్లా. భవిష్యత్తులో మూడు జడ్పీలు గిరిజనులకు కేటాయించబడతాయి. గిరిజన స్వపరిపాలన లక్ష్యం దిశగా కూటమి సర్కారు అడుగులు వేసినట్టవుతుంది.



చారిత్రాత్మక నిర్ణయం

రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లా ఏర్పాటుకు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకం. ముంపు ప్రాంతాల అభివృద్ధి లక్ష్యంతో జిల్లా ఏర్పాటు అంశం తాజాగా తెరమీదకు వచ్చింది.
- మిరియాల శిరీషాదేవి, రంపచోడవరం ఎమ్మెల్యే

నేడే ఆమోద ముద్ర

కొత్త జిల్లాల ఏర్పాటు, కొన్ని జిల్లాల్లో మార్పులుచేర్పులను సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదించిన వెంటనే నోటిఫికేషన్ జారీ అవుతుందనే ప్రచారం జరిగింది. ఈ మేరకు బుధవారం ఆమోదిస్తారనే ప్రచారం ఉంది. ఆమోదించిన వెంటనే అదే రోజు నోటిఫికేషన్ ఇస్తారు. అప్పటి నుంచి మండపేట నియోజకవర్గం కూడా తూర్పుగోదావరి జిల్లాలోకి వస్తుంది. ఇప్పటికే తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కొత్త మ్యాప్ రూపొందించడం.. కొత్తగా పెరిగే గ్రామాలు, మండలాల కసరత్తు మొదలైంది.

పెద్దాపురం డివిజన్‌కు సామర్లకోట

కాకినాడ డివిజన్‌లో ఉన్న సామర్లకోట మండలాన్ని పెద్దాపురం డివిజన్‌లోకి చేర్చుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. పెద్దాపురం అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో సామర్లకోట, పెద్దాపురం మండలాలు కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోల పరిధిలో వేర్వేరుగా ఉన్నా యి. దీనివల్ల పాలనాపరమైన ఇబ్బందులు వస్తున్నాయి. దీంతో సామర్లకోట మండలాన్ని కాకినాడ రెవెన్యూ డివిజన్ నుంచి తప్పించి పెద్దాపురం డివిజన్‌లో విలీనం చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కాకినాడ జిల్లాలో ఉన్న కాజులూరు మండలాన్ని కోనసీమ జిల్లాలో విలీనం చేయాలని ఉపసంఘం ప్రతిపాదించింది. కాజులూరు పేరుకు కాకినాడ జిల్లాలో ఉన్నప్పటికీ ఈ మండలం కోనసీమ జిల్లాలోని రామచంద్రపురం నియోజకవర్గంలో కొనసాగుతోంది. దీనిపై ప్రభుత్వం ఎటూ నిర్ణయం తీసుకోలేదు. దీంతో కాజులూరు కాకినాడ జిల్లాలో కొనసాగనుంది.

- (రంపచోడవరం/చింతూరు/ రాజమహేంద్రవరం/అమలాపురం/ మండపేట/కాకినాడ- ఆంధ్రజ్యోతి)

విభజన జరిగింది ఇలా..

కొత్త జిల్లాల్లో పర్యటించి ఎక్కడెక్కడ ఎలాంటి మార్పులు, చేర్పులు చేయాలనే దానిపై అధ్యయనం చేయాలని ఏడుగురు మంత్రులతో కూడిన ఉపసంఘాన్ని ఈ ఏడాది జూలైలో ప్రభుత్వం నియమించింది. ఈ కమిటీ ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల పర్యటించింది. విభజిత జిల్లాలో ఎలాంటి మార్పులు చేయాలనేది పరిశీలించి సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసింది. నివేదికను తయారుచేసి ప్రభుత్వానికి అందించింది.

మా పోరాటం ఫలించింది

మా పోరాటం ఫలించింది. కూటమి ప్రభుత్వం మండపేట నియోజకవర్గ ప్రజలు ఆకాంక్షను నిజం చేసింది. మండపేట నియోజకవర్గాన్ని తూర్పుగోదావరిలో కలుపుతూ తీసుకున్న నిర్ణయం శుభపరిణామం. ఇది సమష్టి విజయం. నియోజకవర్గ ప్రజల ఇబ్బందులు తీరతాయి. **- వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్యే**



అందుబాటులో పెయ్యి దూడలనే పుట్టించే సెమన్

పశు సంపద వృద్ధితోపాటు పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో డాక్టర్ శ్రీనివాసరావు

అమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పశుసంపదను వృద్ధి చేయడంతోపాటు పాల ఉత్పత్తిని గణనీయంగా పెంచే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రత్యేక చర్యలు చేపట్టినట్టు ఏపీ పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. రైతులకు రెట్టింపు ఆదాయాన్ని పెంచేవిధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో 50లక్షల వరకు ఎదకు వచ్చే సామర్థ్యం ఉన్న పాడి పశువులు ఉన్నాయన్నారు. వాటిలో 2030 నాటికి సుమారు 30లక్షల పాడి పశువులకు ఎద ఇంజక్షన్లు చేయడం లక్ష్యంగా నిర్దేశించామన్నారు. అమలాపురం రూరల్ మండలం ఎ.వేమవరం గ్రామంలో మంగళవారం జరిగిన ఉచిత పశు గర్భకోశ వ్యాధుల నివారణా చికిత్సా శిబిరంలో పాల్గొన్న అనంతరం ఆయన మాట్లాడారు. వికసిత్ భారత్‌లో భాగంగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో ఏటా 10 లక్షల పశువుల్లో పునరుత్పత్తి చేసే ప్రత్యేక కార్యక్రమం చేపట్టామన్నారు. పాడి పశువుల్లో 75 శాతం పెయ్య దూడలు పుట్టే విధంగా శాస్త్రీయంగా రూపొందించిన సెమెన్ అన్ని ప్రాంతాల్లో పాడి రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. పెయ్య దూడలను పుట్టించే సెమెన్ ఖరీదు రూ.300 కాగా 50 శాతం ప్రభుత్వ రాయితీపై పాడి రైతులకు రూ.150కే అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పెయ్య దూడల ఉత్పత్తిని పెంచుకుని ఆర్థిక పురోభివృద్ధిని సాధించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పశు సంవర్ధకశాఖ జిల్లా అధికారి డాక్టర్ వెంకట్రావు, సహాయ సంచాలకుడు డాక్టర్ ఎ.విజయారెడ్డి, చీకట్ల వెంకట నారాయణ పాల్గొన్నారు.



మాచవరంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవ దృశ్యం

కనుల పండుగగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మాచవరంలో ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు మాచరి సూర్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో స్వామి దివ్యకల్యాణాన్ని వైభవంగా చేపట్టారు. ఆలయ ధర్మకర్త గోకవరపు సత్యనారాయణమూర్తి, చినబాబు, సాయిలు పూజల్లో పాల్గొన్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇక బుధవారం షష్ఠి సందర్భంగా స్వామి వారిని దర్శించుకొనేందుకు అన్ని ఏర్పాటు చేసినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే గ్రామంలోని 30అడుగుల సుబ్రహ్మణ్యస్వామి విగ్రహం వద్ద వేడుకలకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక పుల్లేటికుర్రులోని సుబ్రహ్మణేశ్వరస్వామి కల్యాణాన్ని సర్వేజన సుఖినో భవంతు ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అలాగే ఇరుసుమండ, వాకలగరువు, మాచవరం కోరివారి అగ్రహారం, గంగలకుర్రు అగ్రహారం, తదితర గ్రామాల్లో ఉన్న శ్రీవల్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణాన్ని ఆయా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.



30 అడుగుల సుబ్రహ్మణ్యస్వామి

ముగిసిన మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ ప్రకాష్ అంత్యక్రియలు

రెండోరోజు ఉత్సాహంగా..
మోరిలో అంతర్‌జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్
విద్యార్థులు విజయాలు అందుకోవాలి : మంత్రి సుభాష్

- లోపలి పేజీల్లో..

చొప్పెల్ల సచివాలయం దూరం.. దూరం..

» జిల్లాలో అతిపెద్ద సచివాలయం
» ఇక్కడ ఉద్యోగం చేయాలంటే భయం.. భయం..
» 8,500 మంది జనాభాకు ఒకటే సచివాలయం



ఆలమూరు మండలం చొప్పెల్ల సచివాలయం

ఆలమూరు, నవంబరు25(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ కాలంలో ఆరేళ్ల కిందట ఏర్పాటుచేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి తీరని అన్యాయం జరిగింది. ఆనాటి నుంచి నేటి వరకూ ఆ అన్యాయం వెంటాడుతునే ఉంది. సచివాలయాల ఏర్పాటు సమయంలో నాటి నిబంధనల వల్ల కేవలం ఒకేఒక సచివాలయం ఉంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ఈ సచివాలయాల ఎంపిక జరిగింది. అప్పుడు 45మంది వలంటీర్లు ఉన్నప్పటికీ ఒక సచివాలయం రావడం అందరినీ ఆశ్చర్యపరచింది. ప్రస్తుతం ఆ గ్రామంలో సుమారు 8,500 మంది జనాభా ఉన్నారు. వారందరికీ ఒక సచివాలయం ద్వారా సేవలు అందించడం సచివాలయం, గ్రామ పంచాయతీలలో పనిచేసే ఉద్యోగులకు పెద్ద సవాల్‌గా మారుతుంది. అందుకే ఇక్కడ ఉద్యోగం చేయడానికి కూడా ఎవరు ముందుకు రావడం లేదు.

ఎందుకిలా జరిగింది..

చొప్పెల్ల గ్రామానికి ఎందుకిలా జరిగిందనే విషయాన్ని పరిశీలించగా, గ్రామానికి ఒకే సచివాలయం రావడానికి కారణాలు తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది. 2011 జనాభా లెక్కలు ప్రకారం ఆ గ్రామంలో 7,521 మంది జనాభా ఉన్నారు. ఈ గ్రామానికి కస్టర్ గ్రామంగా నవాబుపేటను చేర్చారు. ఆ గ్రామ జనాభా 1,322 మంది. మొత్తం కలిపితే 8,848 మంది ఉన్నారు. అప్పటి నిబంధనల ప్రకారం ప్రతీ 4వేల మంది జనాభాకి ఒక సచివాలయం కేటాయించారు. నాలుగువేలు దాటితే రెండో సచివాలయం వచ్చింది. ఇక్కడ 8 వేల జనాభా దాటినందున మూడు సచివాలయం రావాల్సి ఉంది. అయితే రెండే కేటాయించారు. అయితే ఈ రెండిట్లో ఒకటి చొప్పెల్లలో ఉండగా, రెండో సచివాలయం కేవలం 1,322 మంది ఉన్న నవాబుపేటలో ఏర్పాటుచేయడం జరిగింది. అప్పటి అధికారుల తప్పిదం చొప్పెల్ల గ్రామానికి సరిచేయలేని శాపంగా మారింది. తరువాత రోజుల్లో ఈ కస్టర్ వ్యవస్థ తొలగించడం వల్ల నవాబుపేటకు పూర్తిగా సచివాలయం అందుబాటులోకి వచ్చింది. చొప్పెల్లకు మాత్రం ఒక సచివాలయమే ఉంది.

కోనసీమలో అతిపెద్ద సచివాలయం..

జిల్లాలోనే అతి పెద్ద గ్రామసచివాలయంగా చొప్పెల్ల మారింది. ఇలాంటి పరిస్థితిలో ప్రజలకు సేవలు అందించడం అక్కడ పనిచేస్తున్న ఉద్యోగులకు భారంగా మారుతోంది. చొప్పెల్ల గ్రామసచివాలయం నుంచి విడిపోయి ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిన చెముడులంక జనాభా 4,135 మంది. నాలుగువేలు జనాభా దాటి ఉన్నారు కాబట్టి రెండు సచివాలయాలు వచ్చాయి. 9008 మంది జనాభా ఉన్న మడికి గ్రామానికి మూడు సచివాలయాలు కేటాయించారు. అయితే చొప్పెల్లకు మాత్రం ఒకటే ఉండటం పూర్తిగా అన్యాయం జరిగింది. ఇంతపెద్ద సచివాలయం కావడంతో ఉద్యోగులు ఇక్కడ పనిచేయానికి భయపడిపోతున్నారు. ప్రతీనెల 985 మందికి పింఛన్లు రూ.43.35 లక్షల పంపిణీ చేసే బాధ్యత సచివాలయ ఉద్యోగులు మీద ఉంది. ప్రస్తుతం నలుగురు మాత్రమే ఉద్యోగులు ఉన్నారు. వీరిపై తీవ్ర భారం పడుతుండడంతో ఉద్యోగులు ఇక్కడికి రావడానికి భయపడిపోతున్నారు.

త్వరలో రాష్ట్ర పండుగగా జగ్గన్నతోట ప్రభల ఉత్సవం

పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి దుర్గేష్

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఏకంగా 450 ఏళ్ల చరిత్ర కలిగిన ఏకాదశ రుద్రుల జగ్గన్నతోట ప్రభల తీర్థ ఉత్సవాన్ని త్వరలో రాష్ట్ర పండుగగా ప్రకటించడం జరుగుతుందని రాష్ట్ర పర్యాటక సాంస్కృతిక సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ వెల్లడించారు. జిల్లా పర్యటనలో భాగంగా రాజోలు వచ్చిన మంత్రి ఈ విషయాన్ని వెల్లడించారు. జిల్లాలోని అంబాజీపేట మండలం మొసలపల్లి పరిధిలోని జగ్గన్నతోటలో ప్రతి కనుమ రోజు నిర్వహించే ఏకాదశ రుద్రుల ప్రభల ఉత్సవంపై ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి మేరకు ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తాను, సృజనాత్మక సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ తేజస్విని పొడపాటి తీసుకువెళ్లడం జరిగిందన్నారు. ఈ విషయంపై సీఎం సమ్మతించారన్నారు. త్వరలో ఈ ఉత్సవాన్ని పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం జీవో విడుదల చేస్తుందన్నారు. ఇప్పటికే ఈ ఉత్సవానికి ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసిస్తూ లేఖను విడుదల చేశారు... అలాగే రెండేళ్ల కిందట ఢిల్లీలో జరిగిన గణతంత్ర వేడుకల్లో ఏపీ తరఫున ఏకాదశ రుద్రుల శకటాన్ని రూపొందించి ప్రదర్శించడం జరిగింది... ఈ క్రమంలో ప్రభల తీర్థాన్ని త్వరలోనే పూర్తిస్థాయిలో రాష్ట్ర పండుగగా గుర్తించేందుకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఏటా జరిగే ఈ ఉత్సవాన్ని రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా దేశ, విదేశాల్లో స్థిరపడిన ఈ ప్రాంత వాసులు వచ్చి వీక్షించడం జరుగుతోందన్నారు. ఎన్నో తరాల నుంచి సంప్రదాయంగా వస్తున్న ఈ ప్రభల తీర్థం జరిగే సమయంలో పండుగ వాతావరణం నెలకొని ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంటుందన్నారు. వీటన్నింటితోపాటు కోనసీమవాసుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం ప్రభల తీర్థాన్ని రాష్ట్ర పండుగగా ప్రకటించనుండడం ఆనందంగా ఉందన్నారు. ఏకాదశ రుద్రుల ప్రభలను తీసుకువచ్చే జగ్గన్నతోట ప్రభల తీర్థ అద్భుత ఘట్టాన్ని అందరం కలిసి ఘనంగా నిర్వహించుకుందామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల శాఖ డైరక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.



జగ్గన్నతోట ప్రభల ఉత్సవంపై మాట్లాడుతున్న మంత్రి కందుల దుర్గేష్





అమ్మవార్లకు స్వర్ణహారాలు



అమలాపురం రూరల్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసి ఉన్న శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామివారి దివ్య కల్యాణోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం చింతా అత్తిలింగం-వీరభద్రమణి దంపతులు శ్రీవల్లీదేవసేనకు రూ.10లక్షల విలువైన రెండు బంగారు కాసుల హారాలను అమ్మవార్లకు సమర్పించి అలంకరించారు. చింతా అత్తిలింగం సోదర కుటుంబ సభ్యులు కాసుల హారాలను తయారు చేయించారు. కార్యక్రమంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ, చింతా ఉమా, లక్కింశెట్టి నాగబసవరాజు, యినుమర్తి లింగమూర్తి దంపతులు పాల్గొన్నారు. చింతావారి కుటుంబసభ్యులు తయారు చేయించిన మయూర వాహనంపై స్వామి-అమ్మవార్ల గ్రామోత్సవం నిర్వహించారు.

నైట్‌వాచ్‌మెన్ల బకాయి జీతాలు చెల్లించాలి

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న నైట్‌వాచ్‌మెన్ల సంఘ జిల్లా శాఖ సమావేశం మంగళవారం అమలాపురం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. సీఐటీయూ జిల్లాశాఖ అధ్యక్ష, కార్యదర్శులు గుదే దుర్గాప్రసాద్, నూకల బలరామ్, వాచ్‌మెన్‌ల సంఘం అధ్యక్షుడు రాంబాబు మాట్లాడుతూ నైట్ వాచ్‌మెన్‌లకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే విడుదల చేయాలన్నారు. అనంతరం విశాఖపట్నంలో డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4 వరకు జరిగే అఖిల భారత సీఐటీయూ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. సంఘ ప్రధాన కార్యదర్శి వీవీ సత్యనారాయణ, కోశాధికారి శేఖర్, నాయకులు తాతాజీ, కృష్ణబాలాజీ, సభ్యులు పాల్గొన్నారు.

గ్రామాల్లో రైతన్నా మీకోసం

పి.గన్నవరం, జనవరి 25(ఆంధ్రజ్యోతి):రైతన్నా మీకోసం కార్యక్రమాన్ని మంగళవారం పలు గ్రామాల్లో నిర్వహించారు. రైతన్నా మీకోసం సర్వేను ఉడిమూడిలో ఇన్‌చార్జి ఏడీఏ సీహెచ్‌డీ విజయకుమార్, ఏపీసీ ఎన్‌ఎఫ్ డీపీఎం కె.శ్రీనివాస్‌లు స్థానిక సొసైటీ చైర్మన్ పెన్నమరెడ్డి వెంకటరత్నం నాయుడుతో కలిసి పరిశీలించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈకార్యక్రమం ఐదు రోజులు జరుగుతుందన్నారు. లంకలగన్నవరంలో వ్యవసాయశాఖ, ఉద్యాన శాఖ సిబ్బందితో కలిసి ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాక డొక్కా నాథ్‌బాబులు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్ తదితర అంశాలపై ఇంటింటికి వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. పి.గన్నవరంలో సొసైటీ చైర్మన్ సాధనాలశ్రీవెంకట సత్యనారాయణ, సీఈవో సోమేశ్వరావులు, ముంగండలో సొసైటీ చైర్మన్ మట్టపర్తి వెంకటేశ్వరావు, సీఈవో పి.శేషగిరిరావులు ఇంటిం టికి వెళ్లి రైతులకు కరపత్రాలు అందించారు. ఆయా కార్యక్రమాల్లో ఇన్‌చార్జి గ్రామ సర్పంచ్ గనిశెట్టి గంగాభవాని, ఎంపీటీసీ అవ నిగడ్డ సత్తిబాబు, కొపనాతి సీతారామస్వామి, పైడి బుజ్జి, చిట్టాల రామజోగేశ్వరరావు, ముచ్చర్ల సోమరాజు, పిల్లా శ్రీనివాసరావు, లంకే చిరంజీవి, యర్రంశెట్టి వెంకటరమణ, వేమన రామకృష్ణ, కోలా గోపాలకృష్ణ, మేడిశెట్టి శ్రీనివాసరావు, నల్లా పెద్దకాపు, కొండ్రెడ్డి నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ, ఉద్యానశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పంటలతోనే దేశ సమగ్రాభివృద్ధి

అమలాపురం రూరల్, నవంబరు25(ఆంధ్రజ్యోతి): ఎ.వేమవరంలో పశు వైద్యాధికారిణి డాక్టర్ మాధురి ఆధ్వర్యంలోఉచితగర్భకోశ వ్యాధుల నివారణ శిబిరాన్ని నిర్వహించారు. పశువైద్య శిబిరాన్ని రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ ముఖ్య కార్యనిర్వహణాధికారి డాక్టర్ శ్రీనివాసరావు, జిల్లా పశువైద్యాధికారిడాక్టర్ కె.వెంకట్రావులు ప్రారంభించారు. పాడి పంటలతోనే దేశసమగ్రాభివృద్ధి ఆధారపడిఉంటుందని డాక్టర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. సర్పంచ్ రావూరి వెంకటలక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎ.వేమవరం పరిసర గ్రామాల్లోని పాడిపశువులకు పశుగర్భకోశ వ్యాధుల చికిత్సలు చేసేందుకు పరీక్షలు నిర్వహించారు. పశువైద్య సహాయకుడు సాయినాథ్‌ను గ్రామస్తుల సమక్షంలో సత్కరించారు. ఉచితంగా మందులు, మినరల్ మిక్చర్, మినరల్ బ్లాక్స్‌లను రైతులకు పంపిణీ చేశారు. ఎంపీటీసీ లింగోలు సత్యవతి, నాయకులు రావూరి భాస్కరరావు, దుర్గానారాయణ, లింగోలు నెహ్రూ, దాసం గోపి, పశువైద్య సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్.విజయారెడ్డి, డాక్టర్ చీకట్ల వెంకటనారాయణరావు, పశువైద్యాధికారులు నారాయణరావు, మాధురి పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

ఉప్పలగుప్తం,నవంబరు25(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్టి సందర్భంగా మంగళవారం రాత్రి శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గొల్లవిల్లిలో వీరా శ్రీకృష్ణతాతయ్య, సూర్యకుమారి దంపతులు, ఎస్.యానాంలో పినిశెట్టి నరసింహమూర్తి(బుజ్జి), తులసి దంపతులు, సన్నవిల్లిలో భద్రి వివేకసుబ్రీమ్‌అనిల్, విజయవల్లి దంపతుల ఆధ్వర్యంలో కల్యాణ పూజలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన జరిగింది.భైరవబొట్ల వెంకటసుబ్రహ్మణ్యం (నాని), సుదర్శనం సూర్యనారాయణ, భైరవబొట్ల కుమార్, కాల్దారి వెంకటసత్యప్రసాద్ బ్రహ్మత్వంలో కల్యాణపూజలు జరిగాయి. ఎస్.యానాంలో ఈ నెల26నుంచి 30వరకు సుబ్రహ్మణ్య షష్టి ఉత్సవాలు నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్టు చైర్మన్ పినిశెట్టి నరసింహారావు తెలిపారు. ఎన్.కొత్తపల్లిలో మూడు రోజులు ఉత్సవాల నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): కడలి శ్రీకపోతేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో గల శ్రీవల్లీదేవసేన సమేత శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం మంగళవారం 7.01గంటలకు కన్నుల పండుగగా జరిగింది. ఆలయ కార్యనిర్వహణాధికారి టి.నాగవిష్ణు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. వేదపండితుడు కాకాని వెంకటకృష్ణకుమార్, రుద్రపాక కల్యాణశర్మలతో కల్యాణ క్రతువులు నిర్వహించారు. బుధవారం జరగనున్న షష్టి తీర్థ మహోత్సవానికి భక్తులక ఎటువంటి ఇబ్బందులు కలుగుండా బారికేడ్లు ఏర్పాటుచేశామని ఆలయ ఈవో నాగవిష్ణు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కడలి శ్రీదుర్గ, కడలి నీటిసంఘం అధ్యక్షుడు గాలిదేవర వెంకన్నబాబు, కడలి హైస్కూలు మేనేజింగ్ కమిటీచైర్మన్ వడ్లమూడి ప్రకాశరావు, గ్రామస్తులు, భక్తులు, ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర, జాతీయ స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడలతో పాటు చదువుల్లో రాణిస్తేనే బంగారు భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ షేక్ సలీంబాషా పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకాను మంగళవారం వాగ్దేవి స్కూలు ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో డీఈవో అభినందించారు. స్కూలుగేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తున్న జాతీయస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు ఎంపికైన నిమ్మకాయల చరిష్మ, సాయిరుత్వితో పాటు రాష్ట్రస్థాయి పోటీల్లో విజేతగా నిలిచిన ఉమ్మడి జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహించిన విద్యార్థినులు అల్లం కామాక్షి, శిరీషలను సలీంబాషా అభినందించారు. కార్యక్రమంలో వాగ్దేవి స్కూలు డైరెక్టర్ పరసా భరత్, ప్రిన్సిపాల్ శిష్టా శ్రీరామచంద్రమూర్తి, హెచ్‌ఎం పిచ్చిక సుబ్రహ్మణ్యం, కోఆర్డినేటర్ కె.ఆదిలక్ష్మి, ఫిజికటల్ డైరెక్టర్లు తోట రవి, గారపాటి శ్రీదేవి, పీఈటీ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.


తక్కువ ధరకే నాణ్యమైన జనరిక్ మందులు

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అమలాపురం ఏరియా ఆసుపత్రిలో రోగులకు తక్కువ ధరలకే నాణ్యమైన మందులను అందించే విధంగా ఏర్పాటుచేసిన ప్రభుత్వ జనరిల్ మందుల షాపును మంగళవారం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, నాయకులు పెచ్చెట్టి విజయలక్ష్మి, తిక్కిరెడ్డి నేతాజీ, వలవల శివరావు, ఆవుపాటి గోపాల్, నల్లా స్వామి, ఆశెట్టి ఆదిబాబు, యేడిద శ్రీను, జంగా అబ్బాయి వెంకన్న, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె.శంకరరావు పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పడిపోయినది

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం, కూనవరం గ్రామానికి చెందిన నల్లా వరలక్ష్మి W/o రాంబాబు గారికి సంబంధించిన పాస్‌పోర్టునెం.C6441459 గల ఒరిజినల్ పాస్‌పోర్టును జిరాక్స్ తీసుకునేందుకు ఇంటి దగ్గర నుండి గొల్లవిల్లి సెంటర్‌కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పడిపోయినది దొరికిన వారు ఈక్రింది అడ్రస్ అందజేయగలరు.

నల్లా వరలక్ష్మి
డోర్‌నెం. 3-37, K.H.పేట కూనవరం,
ఉప్పలగుప్తం మండలం సెల్: 7093534352









అమలాపురం

అమలాపురం • ముమ్మిడివరం • పి.గన్నవరం • రాజోలు

రాజ్యాంగ ప్రతిమ ప్రదర్శన

మామిడికుదురు, నవంబరు25(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఈదరాడ హైస్కూలు విద్యార్థులు చిత్రలేఖన ఉపాధ్యాయుడు బత్తుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జీలుగుబండితో రాజ్యాంగ ప్రతిమను తయారుచేసి ప్రదర్శించారు. విద్యార్థులను హెచ్ఎం జి.సాయిబాబా అభినందించారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

అంబాజీపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నియోజకవర్గ కో కన్వీనర్ దాసరి వీరవెంకట సత్యనారాయణ అన్నారు. చిరతపూడి, మాచవరం, చిరతపూడి, నందంపూడి గ్రామాల్లో రైతన్న మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏవో ధర్మప్రసాద్, సొసైటీ చైర్మన్లు దొమ్మేటి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజాదర్బారు.. అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యం



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

అమలాపురం టౌన్, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజా దర్బారు నిర్వహిస్తున్నట్టు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక ప్రజా దర్బారు నిర్వహించారు. నియోజకవర్గం నలుమూలల నుంచి వచ్చినవారు ఇళ్లస్థలాలు, గృహనిర్మాణ రుణాలు, పెన్షన్లు, రోడ్లు, డ్రెయిన్లు తదితర సమస్యలకు సంబంధించి 210 ఫిర్యాదులు ఎమ్మెల్యేకు అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ దెందుకూరి సత్తిబాబురాజు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి వెంకటేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ అధికారి జయవెంకటలక్ష్మి, పట్టణ, మండలశాఖల అధ్యక్షులు తిక్కిరెడ్డి నేతాజీ, చొల్లంగి సత్యసాయిబాబా, వీరేష్‌కుమార్, బొర్రా ఈశ్వరరావు పాల్గొన్నారు.

'ముంపు సమస్యకు పరిష్కారం చూపించండి'

ఉప్పలగుప్తం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కోనసీమలో ముంపు సమస్యకు పరిష్కారం చూపించాలని జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులు కోరారు. క్షేత్ర స్థాయిలో ముంపు ప్రభావాన్ని పరిశీలించేందుకు కోనసీమ రావాలని మంత్రిని అభ్యర్థించారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన, అల్లవరం నీటి పంపిణీ సంఘాల అధ్యక్షులు దంగేటి చిట్టిబాబు, ఆకాశం శ్రీనివాస్, దాట్ల గోపీరాజు సోమవారం యలమంచిలిలో పార్టీ కార్యక్రమంలో ఉన్న మంత్రిని కలిసి ముంపు సమస్యపై ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ముంపు నివారణకు విశేష కృషి చేస్తున్నారన్నారు. సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యేతో చర్చించి తగిన చర్యలు తీసుకునేందుకు మంత్రి అంగీకరించినట్టు డీసీ చైర్మన్ దంగేటి చిట్టిబాబు తెలిపారు.

ముమ్మిడివరం నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం: ఎమ్మెల్యే



డ్వాక్రా గ్రూపుల మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే సుబ్బరాజు

ముమ్మిడివరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు శంకుస్థాన చేశారు. అన్నంపల్లిలో ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.42.80లక్షలు, చినకొత్తలంకలో రూ.43.66లక్షలు, మర్లపాలెంలో రూ.15లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి స్థానిక ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అన్నంపల్లిలో డ్వాక్రా మహిళా రైతు సంఘాలు, కిసాన్ 30 గ్రూపులకు రూ.3లక్షల చెక్కును ఆయన పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, పొద్దుకు నారాయణరావు, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ ఓ.భాగ్యశ్రీ, గుద్దటి జమి, విళ్ల వీరాస్వామినాయుడు, దాట్ల పృథ్వి, చిక్కాల అంజిబాబు, గోదశి పుండరీష్, దూడల స్వామి, దొమ్మేటి రమణకుమార్, కట్టా సత్తిబాబు,బోనం కృష్ణ, అడబాల సతీష్, యాళ్ల ఉదయ్, దంగేటి శ్రీనివాస్, రవివర్మ, చైతన్యవర్మ, బొక్కా రుక్మిణి, మెండి కమల, సంసాని సత్యనారాయణ, బద్రి రమా, మిమ్మితి చిరంజీవి, పొత్తూరి నాగరాజు, మోకా బాలప్రసాద్, గుద్దటి విజయ్, మద్దింశెట్టి పురుషోత్తం, తహశీల్దార్ టి.సుభాష్, డీఈ శ్రీనివాస్, ఎంపీడీవో దీక్షితులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ ఇంటింటా ప్రచారం

అర్హత ఉన్న ప్రతీ ఒక్కరికీ అన్నదాత సుఖీభవ పథకం అందేలా చర్యలు చేపడతామని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. అన్నంపల్లిలో మంగళవారం ఇంటింటా అన్నదాత సుఖీభవ కార్యక్రమ ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో గొలకోటి దొరబాబు, పొద్దుకు నారాయణరావు, తాడి నరసింహారావు, అర్థాని శ్రీనివాసరావు, గుద్దటి జమి, విళ్ల వీరాస్వామినాయుడు, దాట్ల పృథ్వి, చిక్కాల అంజిబాబు, గోదశి పుండరీష్, దూడల స్వామి, దొమ్మేటి రమణకుమార్, కట్టాసత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి



పీఎం కిసాన్ పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి

మామిడికుదురు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కృషి చేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం మాకనపాలెం గ్రామంలో రైతన్నా మీకోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని పీఎం కిసాన్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం పత్రాలను రైతులకు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అనేక పథకాలను అమలుచేసి ఆదుకుంటుందన్నారు. రాయితీపై విత్తనాలు, యంత్ర పరికరాలు అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, జడ్పీటీసీ కసిరెడ్డి అంజిబాబు, ఎంపీపీ కుసుమ నవజాకుమారి, ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, సివిల్ సప్లయిస్ రాష్ట్ర సభ్యుడు మోకా ఆనంద్‌సాగర్, కూటమి నాయకులు జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, బైరిశెట్టి దుర్గారామకృష్ణ, సర్పంచ్ మద్దాల బాబూరావు, పీఏసీఎస్ చైర్మన్ ఈలి శ్రీనివాస్, మద్దాల తమ్మన్న, బోనం బాబు, మద్దాల కృష్ణమూర్తి, మండల వ్యవసాయాధికారి ఎన్వీవీ సత్యనారాయణ, రైతులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

కూటమి ప్రభుత్వం విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మాకనపాలెం గ్రామంలో ఓఎన్జీసీ, సీఎస్సార్ నిధులు రూ.12లక్షలతో నిర్మించిన స్కూలు భవనాన్ని ఎమ్మెల్యే మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు ప్రభుత్వం కల్పిస్తుందన్నారు.

12 గ్రామాల్లో డీబీఆర్సీ సాయం

అల్లవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ సమయంలో నష్టపోయిన పన్నెండు గ్రామాల్లో 2500 కుటుంబాలకు ఢిల్లీకి చెందిన దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆర్థిక సాయం అందజేస్తుందని ఆ సంస్థ ఉన్నతాధికారిణి డాక్టర్ హెన్నా అన్నారు. బోడసకుర్రు కంసాలమామిడి వద్ద సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఒక్కో కుటుంబానికి రూ.4500 చొప్పున అందిస్తామని డీబీఆర్సీ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ అల్లాడి దేవకుమార్ అన్నారు. బోడసకుర్రులో 126కుటుంబాలకు రూ.4500 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ శామ్యూల్ అనిల్‌కుమార్, హేమలత, బొంతు హరికృష్ణ, రొక్కాల నాగేశ్వరరావు, మోసుగంటి దుర్గారావు, విప్పర్తి రామకృష్ణ, బొంతు నిర్మలాజ్యోతి, బత్తుల సునీత, మట్టా జయలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సర్పంచ్ చొరవతో పేదలకు ఆర్థిక సహాయం

కాట్రేనికోన, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కాట్రేనికోన సర్పంచ్ గంటి వెంకటసుధాకర్ చొరవతో గుంటూరు డీబీఆర్సీ క్రిస్టియన్ ఎయిడ్ స్వచ్ఛంద సేవాసంస్థల సౌజన్యంతో మొంథా తుపాన్‌తో నష్టపోయిన ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ వర్గాల ప్రజలకు మంగళవారం రూ.4500 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. వీటితో పాటు రూ.6వేలు విలువైన నిత్యావసరాల కిట్లను పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, సీహెచ్ శామ్యూల్, అనీల్‌కుమార్, డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డాక్టర్ హెన్నా, ఎం.హేమలత, కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కోనసీమలో 1990 నాటి ప్రేమలతో సినిమా



వీరేశ్వరస్వామి ఆలయంలో మాట్లాడుతున్న దిల్ రమేష్

ఐ.పోలవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): 1990 నాటి వాతావరణం ప్రతిబింబించేలా కోనసీమలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో వైవిధ్యభరితమైన ప్రేమ, వినోదాల కలయికతో త్వరలో సినిమా షూటింగ్ ప్రారంభిస్తామని సినీ నటుడు దిల్ రమేష్ అన్నారు. మురమళ్ళ శ్రీభద్రకాళీసహితవీరేశ్వరాస్వామిని మంగళవారం ఆయన దర్శించుకున్నారు. త్వరలో మురమళ్ళ పరిసర ప్రాంతాల్లో షూటింగ్ ప్రారంభిస్తామన్నారు. స్థానిక ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు షూటింగ్ కార్యక్రమాలు ప్రారంభిస్తారన్నారు. ఇప్పటివరకు తాను 263 సినిమాల్లో నటించినట్టు తెలిపారు. ఆలయ ట్రస్టుబోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు రమేష్‌ను సన్మానించారు.

సినీనటుడు రామకృష్ణకు అవార్డు

అల్లవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బెండమూర్లంకకు చెందిన సినీ నటుడు, శ్రీకృష్ణాష్టమి చారిటబుల్ ట్రస్టు చైర్మన్ గుర్రం రామకృష్ణకు మంగళవారం ఇన్‌స్పైర్ నేషనల్ అవార్డును అందజేశారు. విజయవాడ గాంధీనగర్ హోటల్ ఐలాపురంలో బీజేపీ సీనియర్ నాయకుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఏపీ స్టేట్ మహిళా చైర్‌పర్సన్ రాయపాటి శైలజలు రామకృష్ణకు ఇన్‌స్పైర్ నేషనల్ అవార్డును అందజేశారు. రామృష్ణకు కోనసీమ ఫిల్మ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ చైర్మన్ గనిశెట్టి రమణలాల్, గొలకోటి హర, వీరభద్రరావు తదితరులు అభినందనలు తెలిపారు.

కమనీయం సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం

అల్లవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వైనతేయ నదీ తీరాన గౌతమేశ్వరాలయ సన్నిధిలో నిర్మించిన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం వద్ద స్వామివారి కల్యాణం ఘనంగా జరిగింది. వేదపండితులు బాదంపూడి సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో ఆలయ పూజారి శ్రీకంఠం కామేశ్వరరావు పర్యవేక్షణలో వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని కల్యాణం జరిగింది. రాజమహేంద్రవరానికి చెందిన పన్నీరు నగేష్‌కుమార్-లక్ష్మీరాణి దంపతులు కర్తలుగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి గ్రామోత్సవం జరిపారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): మురమళ్ళలో శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. యనమండ్ర సుబ్బారావు, పేటేటి శ్యామలకుమార్ ఆధ్వర్యంలో కల్యాణంజరిగింది. పురోహితుడు నాగాభట్ల రామకృష్ణమూర్తి, అపర్ణ దంపతుల నిర్వహణలో కల్యాణం జరిగింది.రెండో రోజు తీర్థమహోత్సవం, అభిషేకపూజలు, మూడోరోజు త్రిశూలస్నానం, పుష్పోత్సవం జరుగు తాయని ఆలయ కమిటీ తెలిపింది.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణంలో భాగంగా అంతర్వేదిలో మంగళవారం మధ్యాహ్నం స్వామివారికి పల్లకీ సేవ నిర్వహించారు. రాత్రి 7.49గంటలకు స్వామివారి కల్యాణం వైభవంగా జరిగింది. బెల్లంకొండ నాగమల్లేశ్వరరావు-భానుకళ దంపతులతో కాశిన కృష్ణవినాయకశర్మ అర్చక సారథ్యంలో కల్యాణ తంతు జరిపారు. అధిక సంఖ్యల భక్తులు కల్యాణాన్ని తిలకించారు. కేశవదాసుపాలెం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయం, టేకిశెట్టిపాలెం, అంతర్వేది దేవస్థానం తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిపించారు. ఆలయాల వద్ద విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది.

మామిడికుదురు, (ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలను నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. పెదపట్నం, ఆదుర్రు, అప్పనపల్లి, పాశర్లపూడిలంక గ్రామాల్లో షష్ఠి సందర్భంగా మంగళవారం రాత్రి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం ఆయా ఆలయాల వద్ద తీర్థం జరుగుతుంది. కల్యాణోత్సవాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ చెస్ రేటింగ్ పోటీల్లో శాన్వీ ప్రతిభ

అమలాపురంరూరల్,నవంబరు25(ఆంధ్రజ్యోతి): విజయవాడలోజరిగిన అంతర్జాతీయ బిలో 1800 చెస్ రేటింగ్ టోర్నమెంట్‌లో అమలాపురం ఢిల్లీపబ్లిక్ స్కూలు విద్యార్థిని జి.శాన్వీ అండర్-11 బాలికల విభాగంలో మొదటి స్థానం సాధించిందని కోచ్ వి.శ్రీనుబాబు తెలిపారు. శాన్వీకి కృష్ణాజిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ, స్పోర్ట్స్‌అథారిటీ చైర్మన్ ఎ.రవినాయుడు ట్రోఫీ, నగదు బహుమతిని అందజేశారు. డీపీఎస్ ప్రిన్సిపాల్ సంధ్యాల మనువిహార్, చైర్మన్ సంధ్యాల నాయుడు అభినందించారు.

నేడు రాజ్యాంగ ఆమోద దినోత్సవం

యానాం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): యానాం అంబేడ్కనగర్ బుద్ధాపార్కులో రాజ్యాంగ దినోత్సవ సభను బుధవారం సాయంత్రం నిర్వహించనున్నట్లు ఎస్సీ ఎస్టీ యునైటెడ్ ఫోరం అధ్యక్షుడు పోనుగుమట్ల విష్ణుమూర్తి తెలిపారు. ఈసభకు ఎస్సీ ఫోరం ఉపాధ్యక్షుడు నామాడి అప్పారావు అధ్యక్షత వహిస్తారని, ప్రముఖ కవి దాట్ల దేవదానం రాజు ముఖ్యఅతిథిగా పాల్గొంటారన్నారు.

రాజ్యాంగం దేశ అత్యున్నత చట్టం

మలికిపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): దేశంలోని వ్యవస్థలన్నీ రాజ్యాంగంపై ఆధారపడి పనిచేస్తున్నాయని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. మలికిపురం డిగ్రీ కళాశాలలో జరిగిన రాజ్యాంగ ఆమోద దినోత్సవ సభలో ఆయన మాట్లాడారు. శాసన వ్యవస్థ, కార్యనిర్వాహక వ్యవస్థ, న్యాయ వ్యవస్థ ఏర్పాటు, ఆయా అధికారాలు, బాధ్యతలు వాటి మధ్య సమన్వయం ఎలా ఉండాలో రాజ్యాంగం నిర్దేశిస్తుందన్నారు. పలు పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో దేవ రాజేంద్రప్రసాద్, జడ్పీటీసీలు బళ్ల ప్రసన్నకుమారి, మట్టా శైలజ, బత్తుల లక్ష్మణరావు, ఎంపీపీలు ఎంపీ సత్యవాణి, వీరా మల్లిబాబు, సర్పంచ్ గెడ్డం రాజ్యలక్ష్మి, నల్లి శివకుమార్, ఆనంద మహానీ పాల్గొన్నారు.

బీబీఫాతిమా జెహరాకు నివాళి

మామిడికుదురు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త తనయురాలు బీబీఫాతిమాజెహరాకు ముస్లింలు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. పాశర్లపూడిలో పురాతన చరిత్ర కలిగిన పాశర్లపూడి దర్గా వద్ద ఫాతిమా జెహరా షహదత్ మజ్లిస్ మంగళవారం జరిగింది. రాష్ట్రంలోనే ఏకైక దర్గాగా ప్రాచుర్యం పొందిన ఈదర్గాలోకి కేవలం మహిళలకు మాత్రమే ప్రవేశించే అర్హత ఉంది. పురుషులు, గర్భిణులు దర్గా వెలుపల ఉండి ప్రార్థనలు చేశారు. మహిళలు మాత్రం దర్గా లోపలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి దర్గాకు భక్తులు వచ్చి షహదత్‌లో పాల్గొని ముడుపులు, మొక్కులు తీర్చుకున్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్థానిక ముస్లిం సంఘాలు అన్నసమారాధన నిర్వహించారు.

నంది అవార్డులు ఇస్తాం

సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్

మలికిపురంలో రాజీ... నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్ ప్రారంభం





సినిమా చిత్రీకరణకు క్లాప్ కొడుతున్న మంత్రి కందుల దుర్గేష్, కెమెరా స్విచ్ఛాన్ చేస్తున్న మంత్రి సుభాష్

మలికిపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో కూడా ఉత్తమ తెలుగు సినిమాలకు నంది అవార్డులను ఇచ్చేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నట్టు టూరిజం, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురంలోని చంటిరాజు విల్లాస్‌లో శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాజీ.. నో కాంప్రమైజ్ సినిమా షూటింగ్‌కు మంత్రి కందుల దుర్గేష్ క్లాప్ నివ్వగా కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ కెమెరా స్విచ్ఛాన్ చేసి ప్రారంభించారు. దుర్గేష్ మాట్లాడుతూ నంది అవార్డుల ప్రదానం కోసం ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లతో ఇప్పటికే చర్చలు జరిపారన్నారు. నంది నాటకోత్సవాల నిర్వహణ కూడా చేపడతామన్నారు. ప్రధానంగా కోనసీమలో కేరళకు మించి అద్భుతమైన లోకేషన్లు ఉన్నాయన్నారు. చిత్ర నిర్మాణాలకు అనుకూలమైన ప్రాంతమని ప్రభుత్వం కూడా ప్రోత్సాహాలు ఇచ్చేందుకు అనుమతులు సులభతరం చేస్తున్నట్టు తెలిపారు. మంత్రి సుభాష్ మాట్లాడుతూ సినిమాలతో పాటు కార్మికులకు అన్ని ప్రయోజనాలు కాపాడేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందన్నారు. రాంకీ మీడియా ప్రైవేటు లిమిటెడ్ పతాకంపై గెద్దాడ వెంకటసత్యప్రసాద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాను రాంకీ నిర్మిస్తూ హీరోగా కూడా నటిస్తున్నారు. మరో హీరోగా సందీప్, హీరోయిన్‌గా జయశ్రీ బర్మన్, సహనటులుగా రాజీవ్ కనకాల, పృథ్వీరాజ్, మాధురి, జబర్దస్త్ అశోక్, రాము నటిస్తున్నారు. కేఎం రాధాకృష్ణ సంగీతం సమకూరుస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ గ్రామీణప్రాంతాల్లో భార్యాభర్తల అన్యోన్యతతో పాటు బంధువుల ప్రేమానురాగాలను ఈ చిత్రంలో చూపిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏపీ మార్కెట్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల పెదకాపు, కేవీ చంటిరాజు, గెద్దాడ నాగేశ్వరరావు, దిరిశాల బాలాజీ, కేవీ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు కోనసీమకు డిప్యూటీ సీఎం

- పవన్‌కల్యాణ్ పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు
- కేశనపల్లిలో డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరితోటల పరిశీలన



శివకోడులో పవన్ పాల్గొనే బహిరంగ సభ వేదిక వద్ద ఏర్పాట్లు

అమలాపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): ఏపీ డిప్యూటీ సీఎం, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు నియోజకవర్గ పరిధిలోని కేశనపల్లి, శివకోడులో జరపనున్న పర్యటనకు ముమ్మరంగా ఏర్పాట్లు చేశారు. భారీ భద్రత నడుమ పవన్ పర్యటనను విజయవంతం చేసేందుకు అటు అధికారులు, పోలీసులతో పాటు జనసేన పార్టీ శ్రేణులు ఏర్పాట్లలో తల మునకలై ఉన్నాయి. శివకోడులోని 2.0 కార్యక్రమాల ప్రారంభంతో పాటు బహిరంగ సభకు కాపు కల్యాణ మండపం ఎదురుగా ఉన్న లేఅవుట్‌లో ఏర్పాటు చేస్తున్నారు. సభలో సుమారు 10వేల మంది ప్రజలు పాల్గొనే విధంగా సన్నాహాలు చేశారు. పవన్ రాక కోసం గూడపల్లి, శివకోడులో ప్రత్యేక హెలిప్యాడ్లను కూడా ఆర్‌అండ్‌బీ అధికారులు సిద్ధం చేస్తున్నారు. పవన్ పర్యటన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ మంగళవారం సాయంత్రం అధికారులతో సమీక్షించారు. అలాగే జిల్లా ఎస్పీ భద్రతా పరమైన చర్యలను ప్రకటించారు. డిప్యూటీ సీఎం పర్యటించే ప్రాంతాల్లో జనసైనికులు భారీగా ఫ్లెక్సులు, జెండాలు ఏర్పాటు చేసి స్వాగత ద్వారాలు సిద్ధం చేశారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాట్లతో పాటు పవన్ పర్యటనకు సంబంధించి అన్ని జాగ్రత్తలను తీసుకుంటున్నారు. పవన్ క్రేజ్‌ను దృష్టిలో ఉంచుకుని ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ పరిస్థితులు తలెత్తకుండా ప్రత్యేక పాస్‌లు ఇచ్చినవారికి మాత్రమే ఆయా ప్రాంతాల్లోకి అనుమతించే రీతిన ఏర్పాట్లు చేశారు. కాగా కేశనపల్లి డ్రెయిన్ వల్ల కొబ్బరిచెట్లకు జరిగిన నష్టం అంచనాలను పవన్‌కల్యాణ్ కేశనపల్లి వంతెన నుంచి వీక్షించి రైతులతో ముఖాముఖిగా మాట్లాడి శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటారని రైతులు వేయి కళ్లతో ఎదురుచూస్తున్నారు.

పవన్ పర్యటన సాగేదిలా..

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ బుధవారం ఉదయం 9 గంటలకు హైదరాబాద్ బేగంపేట నుంచి విమానంలో బయలుదేరతారు. 9.45కు రాజమహేంద్రవరంలోని మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 10.10 గంటలకు మలికిపురం మండలం గూడపల్లిలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్‌కు చేరకుంటారు. 10.15 గంటలకు కేశనపల్లి వ్యూ పాయింట్‌కు చేరకుని శంకరగుప్తం మేజర్ డ్రెయిన్ కారణంగా దెబ్బతిన్న కొబ్బరి తోటలను పరిశీలిస్తారు. స్థానికంగా 20 మంది బాధిత కొబ్బరి రైతులతో ముఖాముఖిగా తోటలు దెబ్బతినడానికి గల కారణాలపై చర్చిస్తారు. అనంతరం రోడ్డు మార్గాన కేశనపల్లి నుంచి శివకోడుకు 11.20 గంటలకు చేరుకుంటారు. శివకోడులో ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తారు. రాష్ట్రస్థాయి పల్లెపండుగ 2.0 పైలాన్‌ను ఆవిష్కరిస్తారు. అనంతరం బహిరంగ సభలో ప్రసంగిస్తారు. అనంతరం శివకోడులో సభాస్థలికి కూతవేటు దూరంలో ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి మధురపూడి విమానాశ్రయానికి చేరుకుంటారు. అక్కడి నుంచి విమానంలో బయలుదేరి హైదరాబాద్ వెళతారు.

రెండోరోజు ఉత్సాహంగా..

మోరిలో అంతర్‌జిల్లాల ఫెన్సింగ్ టోర్నమెంట్

విద్యార్థులు విజయాలు అందుకోవాలి : మంత్రి సుభాష్



ఫెన్సింగ్ టోర్నమెంటులో తలపడుతున్న విద్యార్థులు

అంతర్వేది, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మోరి హైస్కూలులో 69వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల ఎస్‌జీఎఫ్‌అండర్-17 బాలబాలిక ఫెన్సింగ్ టోర్నమెంట్ రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి వాసంశెట్టి సుభాష్ ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులంతా క్రీడల్లో పాల్గొని విజయాలు అందుకోవాలన్నారు. ముందుగా స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందంతో కలిసి వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులతో మాట్లాడారు. విద్యతో పాటు క్రీడా స్ఫూర్తిని కూడా అలవరచుకుని, వివిధ రాష్ట్రాలకు పోటీ ఇవ్వాలన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యం ఇవ్వడానికి విద్యాశాఖ మంత్రి లోకేశ్ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రతీ విద్యార్థి విద్యతో పాటు వివిధ రంగాల్లో క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఇటువంటి టోర్నమెంట్లు నిర్వహిస్తున్నారన్నారు. అనంతరం మంత్రి సుభాష్‌ను స్థానిక నాయకులు, ఉపాధ్యాయ బృందం ఘనంగా సత్కరించారు. కూటమి శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సుభాష్‌ను సత్కరిస్తున్న స్థానిక నాయకులు

వన్నెచింతలపూడి విద్యార్థినుల ప్రాజెక్టుకు ఉత్తమ అవార్డు



వన్నెచింతలపూడిలో ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డు గ్రహీతలకు పౌర సన్మానం నిర్వహించిన దృశ్యం

అమలాపురం రూరల్, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగిన జాతీయ స్థాయి 52రాష్ట్రీయ బాలల విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వన్నెచింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ ప్రజాస్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకుంది. మంగళవారం పాఠశాల ప్రాంగణంలో మల్టీపర్పస్ సైకిల్ మిల్ ప్రాజెక్టు రూపకర్తలైన సోరపల్లి శశివదన, ఉండ్రాజవరపు భవ్యశ్రీజ్యోత్స్న, మార్గనిర్దేశనం చేసిన ప్రధానోపాధ్యాయుడు గుబ్బల నాగ సత్యనారాయణలకు పౌర సన్మానం చేశారు. వివిధ రాష్ట్రాల నుంచి 267 ప్రాజెక్టులను ప్రదర్శనలో ఉంచగా ఏపీ నుంచి వెళ్లిన మల్టీపర్పస్ ప్రాజెక్టు ప్రశంసలు పొంది ఉత్తమ ప్రజా స్పందన ప్రాజెక్టు అవార్డును దక్కించుకోవడం విశేషమని వన్నెచింతలపూడి, సమనస సర్పంచ్‌లు నక్కా రాజారత్నానాగవాణి, పరమట శ్యామ్, ఎంపీటీసీ నాగమణి కొనియాడారు. పాఠశాల కమిటీ చైర్మన్ ఎలిపే ముత్యాలబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో అవార్డు గ్రహీతలకు దుశ్శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు. మాజీ చైర్మన్ కుంచే వెంకటేశ్వరరావు, సదాశివుడు, కె.రమేష్, పరమట భీమామహేష్, గిడుగు నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు బడుగు సత్యనారాయణ, అడబాల శ్రీనివాసరావు, సుబ్రహ్మణ్యం, రాజేశ్వరి పాల్గొన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు వెండి పతకాలు అందజేయనున్నట్టు గిడుగు నాగేశ్వరరావు ప్రకటించారు.

మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ అంత్యక్రియలు

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో మరణించిన మండపేట మున్సిపల్ మాజీ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ (51) అంత్యక్రియలు మంగళవారం నిర్వహించారు. అమలాపురం ఎంపీ జీ.హరిష్‌మాధూర్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి ప్రకాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. తొలుత శ్రీవరప్రకాష్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన నేతలు టీడీపీ జెండాను కప్పారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంపై ప్రకాష్ పార్థివదేహాన్ని ఏడిద సంఘమేశ్వరంలో ఉన్న కైలాసభూమికి తరలించారు. ప్రకాష్ తనయుడు కిరిటీ అంత్యక్రియలు నిర్వహించారు. ప్రకాష్ అంతిమయాత్రకు భారీసంఖ్యలో ఆయన అభిమానులు, టీడీపీ శ్రేణులు తరలివచ్చారు.



ప్రకాష్ పార్థివదేహంపై టీడీపీ జెండా ఉంచుతున్న ఎంపీ, ఎమ్మెల్యే



అంత్యక్రియల్లో ప్రకాష్ కుమారుడు కిరీటీ, స్థానిక నాయకులు

కాలువలో గుర్తుతెలియని మృతదేహం



యానాం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): యానాం నల్లచెరువులోకి నీరు వెళ్లే ఫ్రెంచ్ కాలువలో మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. యానాంలోని ప్రధాన మంచినీటి ట్యాంక్‌లకు ఈకాలువ నుంచే నీటిని నింపుతుంటారు. సంఘటనతో యానాంలో అందరూ ఆందోళన చెందుతున్నారు. పది రోజులుగా ఈకాలువలో నీరు లేకపోవడంతో మంచినీటి ట్యాంక్‌లకు నీరునింపడం లేదు.అతడు ప్రమాదవశాత్తు పడిపోవడంతో మృతిచెంది ఉండవచ్చని భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కార్యాచరణ ప్రణాళికతో నూరుశాతం ఫలితాలు

ఉప్పలగుప్తం, నవంబరు25(ఆంధ్రజ్యోతి): సమ్మేటివ్ పరీక్షల మార్కుల ఆధారంగా విద్యార్థులను గ్రేడ్ల వారీగా విభజించి వేర్వేరు కార్యాచరణ ప్రణాళికలు అమలు చెయ్యడం ద్వారా టెన్త్‌లో నూరుశాతం ఫలితాలు సాధ్యమని డీఈవో షేక్ సలీంబాషా ఉపాధ్యాయులకు సూచించారు. మంగళవారం ఆయన భీమనపల్లి, గొల్లవిల్లి ఉన్నత పాఠశాలలను సందర్శించారు.టెన్త్ విద్యార్థులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయుల సమక్షంలో విద్యార్థుల పఠనాశక్తిని సమీక్షించారు. సమ్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈవో సత్తి సత్యకృష్ణ, హెచ్‌ఎంలు గోకరకొండ కనకదుర్గ పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో సమగ్రాభివృద్ధి

ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు


విద్యుత్ సబ్‌స్టేషన్‌కు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ హరీష్, ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగంగా పరుగెడుతున్నాయని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం ఏనుగుమహల్ వద్ద ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఏపీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి అనంతకుమారి, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఆకుల రామకృష్ణలతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ముఖ్యంగా ఏనుగుమహల్‌లో రూ.3కోట్ల వ్యయంతో నిర్మించనున్న విద్యుత్ సబ్‌స్టేషన్‌కు భూమిపూజ చేశారు. అనంతరం రూ.23.94 లక్షలతో నిర్మించిన అగ్రికల్చర్ ప్రొడక్ట్ స్టోరేజీ భవనాన్ని, రూ.21.80 లక్షలతో నిర్మించిన హెల్త్‌క్లినిక్‌ను, రూ.69.80 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, డ్రైన్లు, గ్రావెల్ రోడ్డు నిర్మాణాలు, పార్కులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్, ఎమ్మెల్యే సత్యానందరావులు మాట్లాడుతూ గ్రామాల్లో అవసరమైన అన్ని సౌకర్యాల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ధరణాల రామకృష్ణ, చింతం విజయకృష్ణమోహన్, సిద్ధంశెట్టి వీరవెంకట సత్యనారాయణ, బండారు సూర్యనారాయణమూర్తి, సర్పంచ్ బూసి జయలక్ష్మి, కంఠంశెట్టి శ్రీనివాస్, పాలూరి సత్యానందం, గనిశెట్టి వీరేష్, కుడుపూడి పట్టాభిరామారావు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సేంద్రియ వ్యవసాయం...ఎంతో మేలు

కొత్తపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులందరూ సేంద్రియ వ్యవసాయంపై దృష్టిపెట్టాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. మంగళవారం బిళ్ళకుర్రు, కముజుపాలెంలో నిర్వహించిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ప్రభుత్వం అన్నదాతల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కర్షకులను చైతన్యవంతం చేసేందుకు దీన్ని రూపకల్పన చేసిందన్నారు. సాంకేతికతపై ప్రభుత్వం రూపొందించిన కరపత్రాలను రైతుల ఇంటికి వెళ్లి అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ పల్లి భీమారావు, రెడ్డి తాతాజీ, గనిశెట్టి వీరేష్, కముజు గంగాధర్, కంఠశెట్టి శ్రీనివాస్, ఏడీఏ వెంకటరామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యంపై రైతులు దృష్టిపెట్టాలి

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రైతులు ప్రకృతి సేద్యంపై దృష్టిసారించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్ కోరారు. మంగళవారం రామచంద్రపురం మండలం జగన్నాయకులపాలెం, ఉట్రుమిల్లి గ్రామాల్లో రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు సీఎం చంద్రబాబు సందేశం చదివి వినిపించారు. అన్నదాత సుఖీభవ సాయంపై తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉట్రుమిల్లి నీటి సంఘం అధ్యక్షుడు నున్న చిట్టిబాబు, వ్యవసాయ సహాయ సంచాలకులు బి.నాగకుమార్, మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్, రైతు సంఘం నాయకులు శివచౌదరి, రైతులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు


మంత్రి సుభాష్ సమక్షంలో టీడీపీలో చేరిన ఎంపీటీసీలతో పాటు, సర్పంచ్‌లు

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కె.గంగవరం మండలానికి చెందిన పలువురు వైసీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. రామచంద్రపురం టీడీపీ కార్యాలయంలో మంత్రి సుభాష్, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం సమక్షంలో కె.గంగవరం మండలం కుడుపూరు గ్రామ సర్పంచ్ పిల్లి దొరబాబు, గుడిగళ్ల గ్రామ సర్పంచ్ పిల్లి దొరబాబు, తాళ్లపూడి ఎంపీటీసీ కోట రామకృష్ణ, కూళ్ల ఎంపీటీసీ దుర్గా ప్రసాద్, కె.గంగవరం మండలం వైసీపీ యువజన విభాగం నాయకులు జుత్తుక శ్రీనివాస నాగేంద్ర ప్రసాద్, పేకేరుకు చెందిన చిట్టూరి శ్రీనివాస్, రామచంద్రపురం 22వ వార్డుకు చెందిన నూరంపూడి సుబ్రహ్మణ్యం టీడీపీలో చేరారు. వీరికి మంత్రి సుభాష్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారంతా క్రమశిక్షణ, ఐకమత్యంతో మిగిలిన నాయకులతో కలసి పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ అక్కల రిష్వంత్‌రాయ్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు ఉండవిల్లి శివ, ఏఎంసీ మాజీ చైర్మన్ గరిగిపాటి సూర్యనారాయణమూర్తి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మేడిశెట్టి సూర్యనారాయణ పాల్గొన్నారు.

కార్యకర్తలకు వైసీపీలో గుర్తింపు లేదు: వైసీపీలో కష్టపడి పనిచేసే నాయకులకు గుర్తింపు లేదని ఆ పార్టీకి రాజీనామా చేసి టీడీపీలో చేరిన నాయకులు తెలిపారు. మంత్రి సుభాష్, టీడీపీ నేత వాసంశెట్టి సత్యం ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీ కోసం పనిచేస్తామని తెలిపారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి అవలంభిస్తున్న వైఖరి నచ్చక పార్టీకి రాజీనామా చేసినట్టు టీడీపీలో చేరిన వారు తెలిపారు.

వైసీపీకి రాజీనామా చేసిన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు

కె.గంగవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు వైసీపీకి రాజీనామాలు చేశారు. మంగళవారం వారు కె.గంగవరంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తమ రాజీనామాలు ప్రకటించారు. వారు మాట్లాడుతూ వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పిల్లి సూర్యప్రకాష్ విధానాలు నచ్చక కొంత కాలంగా పార్టీకి దూరంగా ఉన్నామని, ఈ రోజు రాజీనామాలు చేస్తున్నామన్నారు. రాజీనామాలు చేసిన వారిలో పిల్లి రాంబాబు (సర్పంచ్, కుడుపూరు), పిల్లి దొరబాబు (సర్పంచ్, గుడిగళ్లభాగ), కోట రామకృష్ణ (ఎంపీటీసీ, పేకేరు), పిల్లి దుర్గాప్రసాద్ (ఎంపీటీసీ, కూళ్ల), వైసీపీ మాజీ యూత్ ప్రెసిడెంట్ జుత్తుక శ్రీనివాస నాగేంద్ర ప్రసాద్(శ్యామ్‌ప్రసాద్) ఉన్నారు.


వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తజనం

వాడపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. వందలాదిగా అయ్యప్ప భక్తులు తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. వారందరికి ఆలయ చైర్మన్ ముదునూరి వెంకట్రాజు స్వామివారి దర్శనం సవ్యంగా జరిగేలా చర్యలు చేపట్టారు. ఆలయంలో పూజల అనంతరం భక్తజనం అన్న ప్రసాదంలో పాల్గొన్నారు.

'చుండ్రు శ్రీవరప్రకాష్‌ను కోల్పోవడం బాధాకరం'


ప్రకాష్ పార్థీవదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

మండపేట, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండపేటకు చెందిన యువనేత మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్ మరణంతో ఒక మంచినేతను పార్టీ కోల్పోయిందని అమలాపురం ఎంపీ జీఎం హరీష్ మాధుర్, ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, జనసేన ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ, టీడీపీ యువనేత వల్లూరి సాయికుమార్‌బాబు అన్నారు. వారంతా ప్రకాష్ అంత్యక్రియల్లో పాల్గొన్నారు. మండపేటలో ఆయన మృతికి సంతాపంగా ప్రైవేటు పాఠశాలలు మూసివేశారు. ఆయన పార్థీవదేహానికి రాజకీయ నాయకులు, ప్రజలు, అభిమానులు, యువత పార్టీలకు అతీతంగా అంతిమ యాత్రలో పాల్గొని నివాళులర్పించారు. సంతాపం తెలిపిన వారిలో మండపేట కమ్మ సంఘ అధ్యక్ష , కార్యదర్శులు రెడ్డి రాధాకృష్ణ, వల్లూరి చిన్నారావుతోపాటు వల్లూరి వీర్రాజుచౌదరి, ఏపీ ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు బుంగ సంజయ్, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి దూళి జయరాజు, రాష్ట్ర మాల మహానాడు అధ్యక్షుడు వెంటపల్లి జాన్ మార్క్, టీడీపీ పట్టణ అధ్యక్షుడు మచ్చా నాగు, శెట్టిబలిజ సంఘ పట్టణ అధ్యక్షుడు బండి గోవిందు, కాపు అభ్యు దయ సంఘ పట్టణ అధ్యక్షుడు జిన్నూరి సాయిబాబా, మండపేట చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాళ్లకూరి గొల్లబాబు, మల్లిపూడి గణేష్, జాగునేస్రా, పళని, వాసా రవికిరణ్, శిరంగు ఈశ్వరరావు, మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ మందపల్లి చంద్రశేఖర్, తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ గడి సత్యవతి, టీడీపీ మండపేట మండల అధ్య క్షుడు కర్రి తాతారావు, మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు, మున్సిపల్ డీఈఈ శ్రీనివాస్ తదితరులు సంతాపం తెలిపిన వారిలో వున్నారు.

పంచముఖ ఆంజనేయుడికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

కొత్తపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మోడేకుర్రు శివారు గొలకోటిపాలెంలో మంగళవారం పంచముఖ ఆంజనేయస్వామివారి పంచమ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పాల్గొని పూజలు జరిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, గనిశెట్టి వీరేష్, చిలకలపూడి సుబ్రహ్మణ్యేశ్వరరావు, నూకల వీరన్న, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై మహిళలకు అవగాహన

రామచంద్రపురం(ద్రాక్షారామ), నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండల న్యాయ సేవాధికారి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక సీడీపీవో కార్యాలయంలో మహిళలకు రక్షణ చట్టాలపై అవగాహన నిర్వహించారు. మీడియేషన్ న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, ప్యానల్ న్యాయవాది బండి సత్యనారాయణ పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీవో వరహాలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

వచ్చేనెల 1న గీతా జయంతి ఉత్సవాలు

రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక గీతా మందిరం వద్ద వచ్చేనెల 1న గీతా జయంతి ఉత్సవాలను నిర్వహించనున్నట్టు గీతా మందిరం నిర్వాహకుడు ఆధ్యాత్మిక గురువు సత్తి రామకృష్ణారెడ్డి తెలిపారు. మంగళవారం వెదురుపాకలో ఆయన మాట్లాడుతూ గీతా జయంతిని పురస్కరించుకుని తెల్లవారుజామున 4.45 గంటలకు సామూహిక గీతా పారాయణ, గాయత్రి ఆస్థాన పీఠాధిపతి ఇటికిరాల సుబ్రహ్మణ్యశర్మతో ఆధ్యాత్మిక ప్రసంగం, మహా ఆవాహన యజ్ఞం, నృత్య కళాకారిణి ఎస్.పద్మ ఆధ్వర్యంలో వైజయంతి కూచిపూడి నృత్య బృందం చిన్నారులతో కూడిపూడి నృత్య ప్రదర్శన అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో వెదురుపాక పరిసర ప్రాంతాల భక్తులు పాల్గొనాలని ఆయన పేర్కొన్నారు.

చినపేటలో అగ్ని ప్రమాదం

ఆత్రేయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం చినపేటలో జరిగిన అగ్నిప్రమాదంలో ఒక కుటుంబం పూర్తిగా నిరాశ్రులయ్యారు. చినపేటలోని పమ్మి శాంత కుమారికి చెందిన తాటాకిల్లు మంగళవారం తెల్లవారుజామున విద్యుత్‌షార్ట్‌సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. ఇది తెలుసుకున్న వాడపల్లి వెంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, పీఏసీఎస్ చైర్మన్ ముదునూరి రామభద్రరాజు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయంతో పాటు 25కిలోల బియ్యం పంపిణీ చేశారు. ప్రమాద స్థలాన్ని తహశీల్దారు రాజేశ్వరరావు పరిశీలించి ప్రభుత్వ పరంగా సహాయం అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

నాలుగు మినీ అంగన్‌వాడీ సెంటర్లు అప్‌గ్రేడ్

కె.గంగవరం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలోని 4 మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కొంపలు, నీలగిరిపేట, కోనరేవుపాడు, నల్లచెరువుగట్టు కేంద్రాలు ఇకపై మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా పనిచేయనున్నాయి. వీటి ఉత్తర్వులను మంత్రి సుభాష్ ఆయా కేంద్రాల సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో వీవీ వరాహలక్ష్మి, సూపర్‌వైజర్‌లు పార్వతి, మాణిక్యాంబ, అంగన్‌వాడీ వర్కర్‌లు పాల్గొన్నారు.

డార్మిటరీ నిర్మాణానికి చర్యలు

ఆత్రేయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల సౌకర్యార్థం డార్మిటరీ వసతిగృహాల నిర్మాణానికి చర్యలు చేపడుతున్నారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు భక్తుల రద్దీకి అనుగుణంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై దృష్టిసారించారు. వకుళమాత అన్నప్రసాదం భవనం చెంతనే ఉన్న దేవస్థానం స్థలంలో డార్మిటరీ వసతిగృహాల నిర్మాణానికి సంబంధించి మెరక పనులు చేపడుతున్నారు. త్వరలో మంత్రుల చేతులు మీదుగా శంకుస్థాపన నిర్వహించనున్నారు. ఈ ప్రాంతాన్ని ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పరిశీలించారు.

దాతల సేవలు ప్రశంసనీయం

డీవైఈవో లక్ష్మణమూర్తి

కపిలేశ్వరపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో దాతలు చేస్తున్న సేవలు ప్రశంసనీయమని రామచంద్రపురం డివిజన్ ఉప విద్యాశాఖాధికారి (డీవైఈవో) పి.లక్ష్మణమూర్తి అన్నారు. మంగళవారం మాచర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా దుస్తుల పంపిణీలో ఆయన మాట్లాడారు. మండపేటకు చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు దివంగత గాడేపల్లి అనంత పార్వతీశం పేరిట ఆయన సతీమణి బాలాత్రిపురసుందరి, ఆయన తనయుడు మాచర ఉన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వీరవెంకట సత్యనారాయణ, జీవీ మాస్టారు కలిసి 24 మంది విద్యార్థులకు రూ.15 వేల విలువ చేసే క్రీడా దుస్తులను డీవైఈవో చేతుల మీదుగా అందజేసారు. క్రీడా దుస్తులు అందజేసిన జీవీ మాస్టారుని డీవైఈవో అభినందించారు. కార్యక్రమంలో ఎంఈవో -2 విజయ్‌కుమార్, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

కపిలేశ్వరపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : కపిలేశ్వరపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాజ్యాంగాన్ని ఆమోదించిన తేదీకి గుర్తుగా 26-11-1949 ఆకారంలో విద్యార్థులు కూర్చున్న ప్రద ర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం వి.శ్రీనివాస్, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు విద్యార్థులను అభినందించారు.

ఎట్టకేలకు ఫలించిన పోరాటం

• 'తూర్పు'లో విలీనంపై ప్రజల హర్షాతిరేకాలు • ఎమ్మెల్యే వేగుళ్లకు కృతజ్ఞతల వెల్లువ


రాజమహేంద్రవరంలో కలపాలంటూ జరిపిన ఆందోళన (ఫైల్‌ఫొటో)

మండపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండపేట నియోజకవర్గాన్ని రాజమహేంద్రవరం జిల్లాలో కలపాలన్న ప్రజల ఆకాంక్షలు నెలవేరాయి. మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కృషితోపాటు అఖిలపక్షం పోరాటం ఫలించటంతో నియోజక వర్గంలోని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తొలుత ఆలమూరు నియోజకవర్గం ఉన్నప్పుడు నుంచి మండపేటతోపాటు కపిలేశ్వరపురం మండలం కలుపుకుని రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో ఉండేది. నియోజకవర్గం పునః విభజన తర్వాత 2009లో రాజమహేంద్రవరం పార్లమెంట్ నుంచి విడిపోయి నూతనంగా ఏర్పడిన కోనసీమ జిల్లాలో మండపేట నియోజకవర్గం కలిసింది. ఆలమూరు నియోజకవర్గం పరిధిలో ఉండే మండపేట టౌన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం మండలం, ఆలమూరు మండలం ఉండేవి. నియోజకవర్గ విభజన జిల్లాల విభజన తర్వాత మండపేట నియోజకవర్గం 2009లో ఏర్పడినపుడు ఆలమూరు నుంచి విడిపోయిన మండపేటను కోనసీమ జిల్లా కేంద్రంలో కలిపారు. ఆలమూరు కొత్తపేట నియోజకవర్గంలో కలసింది. అప్పట్లో అనపర్తి నియోజకవర్గంలో ఉండే రాయవరం మండలం మండపేటలో కలిసింది. మండపేట నియోజకవర్గంలో మండపేట టౌన్, మండపేట రూరల్, కపిలేశ్వరపురం, రాయవరం మండలం ఉన్నాయి. జిల్లాల విభజన సమయం నుంచి నియోజకవర్గంను రాజమహేంద్రవరం జిల్లాలో కలపాలంటూ ఎమ్మెల్యే వేగుళ్లతో పాటు ప్రజలు, అఖిలపక్షంతో కలిసి పోరాడుతున్నారు. ఎట్టకేలకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం రావటంతో ఎమ్మెల్యే కృషితోపాటు అఖిలపక్షం పోరాటంతో ఎట్టకేలకు మండపేట నియోజకవర్గాన్ని ప్రభుత్వం రాజమహేంద్రవరంలో కలపటంతో ఉత్కంఠకు తెరపడింది. కోనసీమ జిల్లాకు వెళ్లాలంటే సుమారు 70 కిలోమీటర్ల మేర ప్రయాణం చేసి అమలా పురం వెళ్లాల్సి వచ్చేది. రాజమహేంద్రవరంలో కలపటం వల్ల నియోజకవర్గ ప్రజలకు కేవలం 20 నుంచి 25 కిలోమీటర్ల దూరంలోనే జిల్లా కేంద్రం అందుబాటులోకి రానుంది. మంత్రివర్గం ఆమోదం తెలపడంపై సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. మండపేట నియోజకవర్గం తొలుత నుంచి రాజమహేంద్రవరం పార్లమెంట్ పరిధిలో ఉండే మండపేట తిరిగి ఇప్పుడు 16 ఏళ్ల తర్వాత తిరిగి చేరడం గమనార్హం.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం


రాయవరంలోని విజయదుర్గా పీఠంలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

రాయవరం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణాన్ని మంగళవారం నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో పీఠాధిపతి గాడ్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో తమిళనాడు రాష్ట్రం తిరుత్తణికి చెందిన వేదపండితులు పాల్గొని వినాయక పూజ, పుణ్యాహవచనం, మధుపర్క సమర్పణ, యజ్ఞోపవీతధారణ, మాంగల్యపూజ, మాంగల్యధారణ తదితర పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా పీఠాధిపతి గాడ్ మాట్లాడుతూ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం తిలకించడం వల్ల ఆయు ఆరోగ్యాలతో పాటు, పెళ్లి కానివారికి వివాహం, సంతానప్రాప్తి లభిస్తాయని, సర్వ ఆటంకాలు తొలగిపోతాయని చెబుతూ స్వామి వారి కల్యాణం విశిష్టత వివరించారు. కార్యక్రమంలో విజయదుర్గా సేవా సమితి ప్రతినిధులు గాదే భాస్కర నారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బలిజేపల్లి రమ, పెద్దపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఠం పీఆర్వో బాబి, అన్నవరం దేవస్థానం పాలకమండలి మాజీ సభ్యుడు కందర్ప హనుమాన్, పీఠం వేద పండితుడు చిమలకొండ వీరావధాని, భక్తులు పాల్గొన్నారు.

షష్ఠి ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి: మండలంలోని వెదురుపాక, రాయవరం, పసలపూడి, సోమేశ్వరం, మాచవరం గ్రామాల్లో సుబ్రహ్మణ్య షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వెదురుపాక తుల్యభాగ కాలువ వద్ద ఉన్న కుమార సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, పసలపూడి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. రాయవరం రాజేశ్వరస్వామి, మాచవరం భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి, సోమేశ్వరం బాలా త్రిపుర సుందరి సమేత సోమేశ్వరస్వామి ఆలయాల వద్ద షష్ఠి ఉత్సవాలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు.

నేత్రపర్వంగా స్వామివారి కల్యాణం

రావులపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): రేపు సుబ్రహ్మణ్యస్వామి షష్ఠిని పురస్కరించుకుని మంగళవారం రాత్రి స్వామివారికి నిర్వహించిన కల్యాణోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలతో పాటు శివాలయాల్లో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి అర్చకస్వాములు కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. స్వామివారికి అర్చనలు, అభిషేకాలు, అష్టోత్తర సహస్ర నామపూజలు, కల్యాణోత్సవం, హారతి తదితర పూజ లు నిర్వహించారు.

ఘనంగా స్వామివారి కల్యాణం

ఆలమూరు, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): పెదపళ్లలోనున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. అర్చకస్వాములు కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా జరిపించగా, మరిడి మురళీ కృష్ణ పావని దంపతులచే దీన్ని నిర్వహించారు. తొలుత స్వామివారిని గ్రామంలో గ్రామోత్సవం జరిపారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వేదికపై ఉంచి కల్యాణం నిర్వహించగా, అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు.

వేడుకలకు ఆలయాలు ముస్తాబు

మండపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం జరగనున్న షష్ఠి వేడుకలకు సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం జరిగే స్వామి వారి షష్ఠి కోసం మండపేటలోని రథంగుడి సుబ్రహణ్యేశ్వరస్వామి ఆలయాన్ని ముస్తాబు చేశారు. ఏడిద, ద్వారపూడి, గ్రామాల్లో వున్న పురాతన సుబ్రహ్మణ్యస్వామి ఆలయాల వద్ద భక్తుల రాక కోసం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆయా ఆలయాల వద్ద వేకువజాము నుంచే భక్తులు రానున్న దృష్ట్యా అవసరమైన చర్యలు తీసుకున్నామని నిర్వాహకులు చెప్పారు. షష్ఠి ఉత్సవాలకు ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు, ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, ఏపీఐడీసీ చైర్మన్ వేగుళ్ల లీలాకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరవుతారని ఆలయ ట్రస్టీ గుళ్లపల్లి ప్రసాదరావు తెలిపారు.

పూర్తయిన ఏర్పాట్లు

ఆత్రేయపురం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఏర్పాట్లకు ఆయా ఆలయాలు ముస్తాబయ్యాయి. బుధవారం షష్ఠిని పురస్కరించుకుని ఆత్రేయపురం, వాడపల్లి, పేరవరం తదితర గ్రామాల్లో సుబ్రహ్మణ్య స్వామి ఆలయాలను ముస్తాబు చేశారు. ఆత్రేయపురం సంతాన సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వెండిపుట్టలో భక్తులకు దర్శనాలు అందించనున్నారు. దీనికి సంబంధించి ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లు చేస్తున్నారు. మంగళవారం రాత్రి పేరవరం సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని నిర్వహించగా, అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.


వల్లూరులో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం

సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కపిలేశ్వరపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి): అంగరలోనున్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. కొమాళ్లపల్లి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్రహ్మణ్యం, వెంకట్రావు అర్చక పర్యవేక్షణలో శ్రీకంఠం మల్లేశ్వరపుశర్మ బ్రహ్మత్వంలో స్వామివారికి సంకల్పం, గ్రామోత్సవం, అనంతరం రాత్రి స్వామివారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయం వద్ద ఈవో ఎం.శ్రీదేవి, ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేశారు. కపిలేశ్వరపురం ఏటిగట్టున, వల్లూరులో కొలువై ఉన్న సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణోత్సవం ఘనంగా జరిగింది. కార్యక్రమంలో అంగర, పడమరఖండ్రిక, వల్లూరు గ్రామస్తులతో పాటు మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

మేలుజాతి పోషకులకు ప్రోత్సాహకం అందజేత

మండపేట, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): కేంద్రియ పశు నమోదు పథకం ద్వారా మేలుజాతి పశు పోషకులకు సంబంధించి రూ.4,34000 నగదును రైతుల ఖాతాల్లో జమ చేశామని కేంద్రియ డాక్టర్ త్యాగి తెలిపారు. ఒంగోలు ముర్రాజాతి పశువులకు సంబంధించి 130 పశువులకు, వాటి పోషకుల సంబంధించి అందజేశామన్నారు. ఉమ్మడి జిల్లాలో ఉన్న రాజమహేంద్రవరం, మండపేట అనపర్తి, రావులపాలెం, కపిలేశ్వరపురం, ఆలమూరు మండలాలకు చెందిన ఎంపిక చేసిన రైతులకు ప్రోత్సాహక నగదు అందించామని స్థానిక మేలుజాతి కేంద్రియ పశు నమోదు అధికారి డి.రాజేశ్వరరావు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు.

బూత్ కమిటీ వ్యవస్థ పటిష్టతకు కార్యాచరణ

రావులపాలెం, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): బూత్ కమిటీల వ్యవస్థ పటిష్టతకు కార్యాచరణ రూపొందించామని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు చిలువూరి సతీష్‌రాజు అన్నారు. రావులపాలెం క్యాంపు కార్యాలయం వద్ద నిర్వహించిన సమావేశంలో క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, నాయకులకు దీనికి సంబంధించిన కరపత్రాలను అందజేశారు. టీడీపీకి ప్రజల నుంచి వచ్చిన మద్దతును కేవలం ఎన్నికల విజయంగా కాకుండా శాశ్వతమైన క్షేత్రస్థాయి శక్తిగా మార్చాలని లక్ష్యంగా దీన్ని రూపొందించామన్నారు.

సీఆర్‌పీలను సొంత మండలాల్లో కొనసాగించాలి

ద్రాక్షారామ, నవంబరు 25(ఆంధ్రజ్యోతి): అంబేద్కర్ కోనసీమ జిల్లాలో క్లస్టర్ కాంప్లెక్సులు మినహా మిగిలిన 29 మంది సీఆర్‌పీలను బదిలీలపై కాకినాడ, అల్లూరి సీతారామరాజు జిల్లాకు వెళ్లాలని అధికారులు ఇచ్చిన ఆదేశాలపై సీఆర్‌పీలు రామచంద్రపురం, కొత్తపేట డివిజన్ ఉప విద్యాశాఖాధికారి పి.లక్ష్మణమూర్తికి వినతిపత్రం అందజేశారు. జిల్లా జేఏసీ చైర్మన్ సీహెచ్ వెంకన్నబాబు ఆధ్వర్యంలో సీఆర్‌పీలు తమ సమస్యలు వివరించారు. చాలీచాలని జీతాలతో కనీస వేతనం, ట్రావెలింగ్ అలవెన్సులు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సొంత మండలాల్లో సీఆర్‌పీలను కొనసాగించాలని కోరారు.

విద్యార్థులతో మాక్ పోలింగ్

కపిలేశ్వరపురం, నవంబరు 25 (ఆంధ్రజ్యోతి) : వల్లూరు ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా విద్యార్థులతో మాక్ పోలింగ్ నిర్వహించారు. విద్యార్థులంతా ఓటింగ్‌లో పాల్గొనేలా అవగాహన కల్పించారు. పరిశీలకులుగా పాఠశాల హెచ్ఎం చిట్టూరి వెంకటశ్రీధర్, ఉపాధ్యాయులు రామతులసి వ్యవహరించగా విద్యార్థులు ఓటు వేశారు. అనంతరం ఎన్నికల ఫలితాలను లెక్కించి విజేతలను ప్రకటించి వారిని అభినందించారు. పాఠశాలలో నిర్వహించిన ఎన్నికల తీరును పరిశీలించిన తల్లిదండ్రులు వారికి అభినందనలు తెలిపారు.